# తీర్పు

ఇమంది రామారావు

కాకినాడ... బుడంపేట సందు...

రాత్రి రెండో ఆట సినిమా వదిలిం తర్వాత...

చీకటిలో ఆమె కళ్ళు గాజు గోళీల్లా మెరుస్తున్నాయి.

సడన్‌గా ఆగాను. ఆమెను చూడాలని సిగరెట్ వెలిగించాను. ఆ చిన్న వెలుతురులో ముఖంలో ఏదో కొట్టొచ్చేలా కనిపించే ఆకర్షణ.

"ఉంటారా!" హస్కీగా అడిగింది.


"............"

"లోపలికి రండి..." ఏదో ఆశ ఆమె గొంతులో ధ్వనించింది.

కళ్ళలోంచి ఒణుకు వెన్నులోకి వచ్చింది. భయం... ఆ భయం బయటికి ప్రదర్శిస్తే నవ్వుకుంటుందేమో. ఇలాంటి అనుభవం కొత్త.

ఎప్పటి కప్పుడు వెళదాం అనుకోవడం... ఏదో ఆటంకం... భయం... తప్పు చేయబోతున్నానన్న ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్.

"బయట నిలబడితే బాగోదు రండి!" ఈసారి ఆమె గొంతులో కాసింత చనువు చోటు చేసుకుంది. చాలా తీయగా ఉంది ఆమె గొంతు. వెనకా ముందు చూశాను. ఎవరూ లేరు. థాంక్ గాడ్! అని లోలోపలే అనుకుంటూ ఒక్క అంగలో మెట్లెక్కి ఆమెను అనుసరించాను. లోపల మరో రెండు పోర్షన్లు వున్నాయి. వాటిని దాటుకొంటూ పెరడు వైపుకి నడిచింది. అక్కడ డిమ్ లైట్ మాత్రమే



వెలుగుతూంది. చీకట్లో ముసలమ్మని తొక్కేశాను. నేలమీదే పడుకునుం దామె; కనిపించలేదు.

గొంతు సవరించుకొంటూ 'ఎవరూ!' అందామె ఒణుకుతున్న స్వరంతో బాధగా.

'పాసింజరు లేవే...నువు పడుకో!' చికాగ్గా సమాధానం చెప్పిం దామె.

చిన్న గది. ఆ గదిలోనూ డిమ్ లైట్. సింగిల్ బెడ్. పిల్లన గోవి ఊదుతున్న కృష్ణుడు ఫొటో. దాని ముందర నిరోధ్ పాకెట్. అ గదిలోంచి బయటికి నీరు పొవడానికి చిన్న మార్గం.. అక్కడే చెంబు, బకెట్...ఇదీ ఆ గది అలంకరణ. గోడకు అతికించిన నగ్నసుందరి బొమ్మని ఎవరో సగం చింపేశారు. గుండె దడ ఎక్కువయ్యింది. ఆపాద మస్తకం కంపనం బయులుదేరింది. చలి ముంచుకొస్తూంది. బలవంతంగా కంట్రోల్ చేసుకుంటున్నాను. అయినా ఒణుకు తగ్గలేదు.

"కొత్తా!" తనే చొరవ చేసింది.

"ఊఁ!"

"ఇందాకా వచ్చి భయపడతారు దేనికి?" పెదవులమీద అందమయిన చిరునవ్వుని పులుముకోడానికి ప్రయత్నం చేస్తోంది. "మీరేం చేస్తుంటారు?"

''చదువుకొంటున్నాను...'' చెప్పకూడ దనుకొంటూనే చెప్పేశాను.

"ఏం చదువుతున్నారు?"

"లిటరేచర్...బి.ఏ. లిట్."

"ఇంగ్లీషా, తెలుగా?"

"ఇంగ్లీష్!"

"ఫైనలియరా!?"

అవు నన్నట్లు తలూపాను.

"చదువుకున్నవాళ్ళు ఇలా రావచ్చా!?" గోముగా ప్రశ్నించింది.

ఆ ప్రశ్నకు నెత్తిమీద పిడుగు పడ్డట్లు ఫీలయ్యాను. అంత చలిలోనూ ముచ్చెమటలు పోస్తున్నాయి.

"మీరు చాలా టెన్షన్‌గా ఫీలవుతున్నట్లున్నారు. ముందు రిలాక్స్ అవ్వండి. పడుకోండి..." అంటూ తనే నన్ను తన మీదికి లాక్కుంది.

అప్రయత్నంగా ఆమె గుండెలమీద నేను పడిపోయాను. సడన్‌గా నా శరీరంలోకి కరెంట్ పాసైన ఫీలింగ్. చటుక్కున లేచి కూర్చున్నాను.

"ఎందుకు లేచారు?"

సిగ్గుపడుతూ, "ఒకసారి... ఎంత?"

''వంద ఇవ్వండి. కొత్త కదా సరిపెట్టుకుంటాను" అంది తల దించుకొని. ఆమె పైట ఎప్పుడో జారిపోయింది. ఆమె యౌవనం నన్ను సవాల్ చేసిన ట్లనిపించింది.

వంద రూపాయలు తీసి ఇచ్చాను.

చటుక్కున తీసి మడత పెట్టి, కృష్ణుడి విగ్రహం కింద పెట్టింది.

"రండి. ఆలస్య మవుతోంది!" తొందర చేసింది.

"నే నడిగే ప్రశ్నలకి మీరు సమాధానం చెప్పాలి!" అన్నాను.

"ముందు వచ్చిన పని కానివ్వండి. తర్వాత తీరిగ్గా మాట్లాడుదురుగాని..."

"నేను వచ్చిన పని ఇదే...మాట్లాడదామని. మీ పేరు?'

"ప్లీజ్...పర్సనల్ విషయాలు వద్దు. '' కవ్వింతగా అంది.

"పేరు చెప్పండి!" మొండికేశాను.

"చెప్పక తప్పదా?" ఎదురు ప్రశ్న.

"తప్పదు!"

"సీత --" అంది.

ఆమె సమాధానం చాచి చెంపదెబ్బ కొట్టిన



ట్లనిపించింది.

"మీ రెంతవరకూ చదువుకున్నారు?" ఆమె మాటల్ని బట్టి చూస్తుంటే చదువుకు న్నామెలా అనిపిస్తూంది. తెలుసుకుందామన్న కుతూహలం లోలోపల ఎదురుచూస్తోంది.

"నేనూ డిగ్రీ చదివాను" అంది సంక్షిప్తంగా.

మరో దెబ్బ కొట్టినట్లయింది.

"ఈ వృత్తిలోకి ఎందుకు వచ్చారు. ఎలా వచ్చారు?" ఆసక్తిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాను.

"ఏమండీ! ఇపు డవన్నీ అవసరమా? నా తలరాత ఇలా రాసుండి వచ్చాను. ఇపుడు విచారించి మార్చగలిగేది ఏమయినా ఉందా?' అసహనంగా ప్రశ్నించింది.

"మారవచ్చుగదా. మీరూ అందరిలా గౌరవంగా బతకచ్చుకదా!" అన్నాను.

"చూడండి...వంద రూపాయ లిచ్చారు. మీరు చదువుకుంటున్నారని కాస్సేపు సరదాగా మాట్లాడాను. ఇక సీరియస్‌గా సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. మీరు వంద రూపాయలు ఇచ్చింది ఒకసారి నా శరీరంతో మీ కిష్టమొచ్చినట్లు ఆడుకొని, వెళ్ళడానికి. సమయం వృధా చేస్తే, మరో పావుగంటలో మా ఓనరమ్మ వస్తుంది. మిమ్మల్ని, నన్ను తిడుతుంది. ఇది అవసరమా చెప్పండి. ప్లీజ్. డోంట్ వేస్ట్ ది ప్రెషస్ టైమ్. కిస్ మీ డియర్... ప్లీజ్... ప్లీజ్!" ఆమెలో కోరిక కుబుసం విడిచింది.

'బై గాడ్ చెవుతున్నాను. మీ గురించి తెలుసుకుందామని వచ్చాను!' అన్నాను.

"తెలుసుకొని ఏం చేస్తారు?"

"కథ రాస్తాను!"

"ఎంతొస్తుంది!"

"డబ్బు కోసం కథలు రాయను. నా మనసు గాయపడితే ఆ ప్రేరణతో నా మెదడును దొలిచే సమస్యను అందంగా చెప్పడానికి ప్రయత్నిస్తాను.'

"మీ కథల్లో పరిష్కారం వుంటుందా?"

"తప్పకుండా!"

"మీ పరిష్కారం కాదు నాకు వలసింది. మీరు సమాజంలో రెండు పాత్రలు తీసుకుంటారు. సపోజ్ నేను పతితను, మీరు స్టూడెంట్. నన్ను చూసి జాలి పడి, నాకో మంచి మార్గం చూపించడానికి చెర విడిపించి, పునర్జన్మ ప్రసాదించారు. అది కథలో... ఆ కథ రాయడానికి బావుంటుంది. చదవడానికి బావుంటుంది. బట్ ఆ పరిష్కారాన్ని మీరు కథల్లో యివ్వగలరు. నిజ జీవితంలో యివ్వగలరా?' సూటిగా కళ్లల్లోకి చూస్తూ అడిగింది. క్షణం స్తబ్దంగా వుండి పోయాను.

"మాట్లాడరేం..?" కుదుపుతూ అడిగింది.

"సీతా... అయిపోయిందా?" తలుపు దబదబా బాదుతూ అడిగింది ఓనరమ్మ.

"అయిపోవచ్చింది, వన్తున్నానమ్మా!" ప్రాధేయపడుతూ సమాధానం చెప్పింది సీత ఓనరమ్మతో...

"ఎంత తీసుకొంటుంది?" కోపంగా అడిగాను. సీత బాధగా నవ్వింది.

ఆ నవ్వు నా గుండెల్లో ఎక్కడో గుచ్చుకుంది.

"ఏం?"

"మీరు గంటున్నా ఒకటే. రోజంతా వున్నా ఒకటే. దయ చేసి తొందరగా బయట పడండి. మరో సారి తీరిగ్గా మాట్లాడుకుందాం!" అంది అసహనంగా.

"వంద తీసుకో. ఇంకాస్సేపు వుంటాను!" అంటూ అందించాను. మళ్లీ చటుక్కున తీసుకుంది.

"అరవొద్దని చెప్పు!" అన్నాను.

"తొందరగా...కాస్సేపట్లో మావయ్యగారు వస్తారు" అంది.

"మావయ్య గారంటే?'

"ఓనరమ్మ తమ్ముడు."

"ఎందుకూ?"

'పాసింజర్లు అల్లరి చేస్తే నాలుగు పీకుతాడు. అల్లరి చేయక పోతే తనే అల్లరి చేసి బయటికి తొందరగా పంపిస్తాడు.'

"వాడికేం అధికారం?"

"వాడిదే అధికారం. ఓనరమ్మ తమ్ముడు. ఈ ఇంట్లో ముగ్గురం సానులం వున్నాం. మా ముగ్గుర్లో ఎవర్ని ఎపుడు కావాలన్నా ఒప్పుకొని తీరాల్సిందే!"

"ఒప్పుకోకపోతే?"

"చావ బాది ప్రాణాలతో విడిచి పెడతాడు!"

"సీతా. ఏంటీ. నస. తొందరగా తెమిల్చు!" ఆ గొంతు మావయ్యదే. రౌడీ మావయ్యా. ఓనరమ్మ తమ్ముడు. ఆ గొంతు వింటుంటే ఒళ్లంతా కంపరం బయలుదేరింది నాకు.

"అయిపోయింది మావయ్యా!"

"ఏం అయ్యింది? అపుడే గంటయ్యింది. గంటకి అయిదు వందలు గుంజాలి. కనీసం మూడొంద లయినా ముట్టాలి. అంతకు తక్కువైతే నీకు రూపాయి మిగల్దు. అది గుర్తుంచుకో!" అరిచాడు.

"అదేమిటి? ఇందులో నీకు ఎంత ముడుతుంది?"


"మీరు తొందరగా వెళితే యాభై. కాస్త ఆలస్యంగా అయితే పాతిక. ఇంకా ఆలస్యం అయితే మరో గంట. అదీ కండిషను!" ఈ మాటలు చెబుతున్నపుడు ఆమె కళ్లల్లో పలచటి కన్నీటి తెరలు చోటు చేసుకున్నాయి.

"సీతా! యిది నరకంలా అనిపించ లేదూ?"

"అనిపిస్తే ఏం చేయగలం?"

"నువ్వు బయట పడగలవా?" అడిగాను.

"మీరు బయట పడేయగలరా?" సూటిగా అడిగింది.



"అంటే?"

"నన్ను అయిదు వేలకి అమ్మేశారు. నేను బైట పడాలంటే అయిదు వేలు కక్కాలి!"

"ఇవ్వక పోతే?"

"ఇంతే సంగతులు. నా కోపం వస్తుంది మీ మీద. మీరు... లేకపోతే వెళ్లి పోండి."

"వెళ్లక పోతే?"

"పోలీసు లొస్తారు. నిన్ను ... సారీ అలవాటై పోయిన భాష.మిమ్మల్నీ, నన్నూ మునిసిపాలిటీ కుక్కల్లా మెడ పట్టి బయటికి గెంటి పోలీసు జీపులో తీసుకెళ్తారు"

"అంత హఠాత్తుగా ఎలా వస్తారు?"

"ఇక్కడే వుంటారు. మేకపోతుని బలెయ్యడానికి తీసుకెళ్లినట్టు తీసుకెళ్తారు."

"మీరు ప్రతిఘటించరా?"

"అప్పటికి సగం చచ్చి వుంటాం. పోలీసు జీపు చూడగానే పూర్తిగా ఛస్తాం. కళ్లు మూసుకొని జీపులో కూర్చుంటాం. ముఖం కప్పుకొని కోర్టులో హాజరవుతాం. ఏదో పెనాల్టీ కట్టమంటారు. మా ఓనరమ్మే పెనాల్టీ కడుతుంది. నూటికి పాతిక వడ్డీ ఇచ్చుకోవాలి!"

"ఎవరూ?"

"ఇంకెవరూ మేమే!"

"మీరెలా ఇవ్వగలరు?"

"మా సంపాదన లోంచి."

"ఒక వేళ సంపాదించక పోతే?"

"మా ఖర్మ. అనుకుంటాం. ఓనరమ్మ అనే మాటలు రౌడీ మావయ్య చేత తన్నులు తిని, మాలో మేమే కుళ్లి పోతాం!" అంటూండగా ఆమె గొంతులో జీర.

ఆమె చెంపలను తాకుతూ కన్నీళ్లు కారాయి.

"డోంట్ వర్రీ. కూల్ డవున్!" అన్నాను.

"దయ చేసి యిక మీరు వెళ్లండి. లేదంటే నేను ఎదు రిచ్చుకోవాలి!" చేతులు రెండూ జోడించింది.

మళ్లీ ఓనరమ్మ అరుపు.

మళ్లీ రౌడీ మావయ్య కేకలు.

"అదిగో పోలీసులు వస్తున్నారు ..." అన్న గుసగుసలు. కాస్సేపట్లో తలుపుని బలంగా తన్నారు. తలుపు గొళ్ళెం వూడి పోయింది.

" పదరా. ఎక్కూ జీపు!" అంటూ అరిచాడు ఒక పోలీసు.

"ఏవండీ. మీకు దండం పెడతాను. ఈయనేం తప్పు చేయ లేదండీ. చూడండి. కనీసం షర్టు కూడా విప్ప లేదు. ప్లీజ్ ఆయన్ని వొదిలేయండి! మీ కాళ్లకు మొక్కుతాను!" ఆ పోలీసు కాళ్లకు చుట్టుకొని ప్రాధేయపడుతోంది సీత.

"యేషాలు వెయ్యకే. నువ్వు తప్పు చేయ లేదంటే ఎవరు నమ్ముతారే? నువ్వు తక్కువ తిన్నావా. రెచ్చగొట్టి కుర్రనాకొడుకు అందర్నీ పిచ్చెక్కించినావు కదే! నిన్నూ.. నిన్నిలా కాదే. అసలు నువ్వీ యాపారానికి పనిచేయకుండా చేసెయ్యాల!" అంటూ మొల మీద బూటు కాలితో తన్నాడు పోలీసు పొగరుగా.

"అమ్మా!" అంటూ మెలికలు తిరిగిపోయింది. ఆ 'అరుపు'కి ఆమె లోపల పేగులు కదిలిన ట్లనిపించింది.

"పేసెంజర్లతో డైలాగ్సు కొట్టొద్దని ఎన్ని సార్లు చెప్పేనే. తీసికెల్లండి బాబూ! బాగా దంచేసి ఇంకెప్పుడూ ఇలాంటి యదవ్వేషాలు వెయ్యకుండా బుద్ధి సెప్పండి!" సిఫారసు చేశాడు రౌడీ మావయ్య.

నాకు మతి పోయినట్ల నిపించింది.

బరబరా లాక్కుంటూ తీసుకెళ్తున్నాడు సీతని.

నా కాలర్‌ని పట్టుకొని మరో పోలీసు "నడువ్!" 'అన్నాడు.

రక్తం ఉడికిపోయింది. ప్రతిఘటించలేక పోయాను. అలాగని పైశాచిక ప్రవృత్తికి తలొగ్గలేక పోయాను కూడా.

జీపులో కూర్చున్నాను..

నా పక్కనే సీత-

"ఏం పేరు గురూ గారూ!" అన్నాడు పోలీసు వ్యంగ్యంగా.

"రాము!"

"భలేగుందయ్యా! వ్యభిచారం. రేపు పేపర్లో వొస్తుంది చూడు నీ తల కాయంత అక్షరాలతో.' '

జీపు కదిలింది.

"పోలీసు మావా. నీకు దండం పెడతాను. ఎంత కావాలో చెప్పూ. ఈ బాబుని వొదిలెయ్. నన్ను తీసుకెళ్లు..." భోరున ఏడుస్తోంది సీత.

"ఎందుకే వాడంటే అంతమోజు? ఇదిగో పేవఁలు పెంచుకో కూడదే! మనసు రాయి చేసుకోవాలి! హితోపదేశం చేశాడు పోలీసు నిప్పులు కురిపిస్తున్న కళ్లతో చూస్తూ.

"అలాగే రాయి చేసుకుంటాను. కాని ఈ ఒక్క బాబు విషయంలో నన్ను వొదిలెయ్యండి. పాపం అన్నెం పున్నెం తెలీదు. మనసున్న మనిషి. నా కష్టసుఖాలు తెలుసుకుందా మని వచ్చాడు. కష్టాల్లో పడ్డాడు. ఈ బాబుకి శిక్ష వెయ్యడం న్యాయం కాదు. ఈ బాబు పేరు పేపర్లో పడటం న్యాయం కాదు!" పసి పిల్లలా ఏడుస్తూ ప్రాధేయపడింది సీత.

నా కడుపులో దేవుతున్న ట్లనిపించింది.

నా కందుబాటులో కత్తి గాని, పిస్టల్ గాని వుంటే అందర్నీ చంపి మరీ శిక్ష అనుభవించే వాడ్ని. సీత ఏడుపు వింటున్న నా అణువణువూ కాగిపోతూంది. జీపు స్పీడందుకొంది. పోలీస్టేషన్ రానే వచ్చింది.

"దిగండి!" అరిచాడు.

"పోలీస్ మావయ్యా! నీకు దండం పెడతాను ఈ బాబుని వొదిలొ ఎట్టండి!" - పట్టిన పట్టు విడవకుండా ప్రాధేయపడుతూంది.

"సర్ ఒక పని చెయ్యి. లోపల మా ఎస్సై గారున్నారు. ఆయనకి ఒప్పుకో. ఎస్సై ఫ్రెండ్ వొకడు ఊరి నుంచి వచ్చాడు. ఆడికి ఒప్పుకో. మధ్యలో యదవేషాలు వేశావా, కుళ్లబొడిచేస్తారు. ఎస్సైగారు జాగ్రత్త!" సీనియర్ పోలీసు 'క్లూ' అందించాడు.

"అలాగే. థాంక్సండీ. చాలా థాంక్స్!"

"సీతా! నీకేవన్నా పిచ్చెక్కిందా?" అన్నాను.


కథాప్రభలో

శ్రీమతి ఎన్. కల్యాణసుందరీ జగన్నాథ్

పెద్దకథ

**'మట్టిగోడలు'**

వ్యభిచారం

"ఏంట్రా నువ్వేమైనా హీరో అనుకుంటున్నావా? మక్కీ లిరిగిపో గలవు జాగ్రత్త!" వార్నింగ్ ఇచ్చాడు సీనియర్ పోలీసు. సీత నా కళ్ల ముందరే ఎస్సైగారి రూమ్‌లోకి వెళ్లింది.

"ఒద్దు. సీతా. పడిన శిక్ష ఎలాగూ పడుతుంది. నా కోసం నువు నరకం అనుభవించకు."

సీత నన్ను పట్టించుకో లేదు.

సీత వెళ్లగానే తలుపులు మూసుకున్నాయి.

కాస్సేపట్లో అరుపులు... ఏడ్పులూ! "మోసం. అమ్మో... నాయనో... చంపేస్తున్నారు దేవుడో.. ప్రాణాలు పోతున్నాయి రండ్రోయ్ మాకు శిక్ష వెయ్యండి. నన్ను వొదలి పెట్టండి" బయటికి వినిపించేలా అరుస్తోంది సీత. బాధని... కాదు... వాళ్ళు చేస్తున్న చిత్రహింసని భరించ లేక.

"ఇది అన్యాయం! అన్యాయం."

"గట్టిగా అరవకు. అవుటయి పోగలవు!"

"రామూ!" అంటూ కెవ్వున కేక వినిపించింది.

పోలీస్ స్టేషన్ దద్దరిల్లి పోయింది. చావు కేక అది.

ఒక్క సారి పోలీస్టేషన్ బిక్కచచ్చిపోయిన ట్లనిపించింది.

అంతే!

క్షణాల్లో తలుపులు తెరుచుకున్నాయి. ఎస్సైగారు. అతని ఫ్రెండ్ 'సీత'ను... స్పృహ లేకుండా పడిపోయిన సీతను.. రక్తసిక్తమైన సీతను... బరబరా బయటికి ఈడ్చుకుంటూ వచ్చారు.

"సీతా!... సీతా!... ఏం సీతా. ఏమయ్యింది సీతా?"

ఏమిటీ దారుణం? నాకు ఏడుపు ఆగ లేదు.

"ఏమండీ రేపు కోర్టులో హాజరు పరచండి. కాని ముందు సీతను బతికించండి. డాక్టర్ని పిలవండి!" అన్నాను.

ఒక పోలీసు బాగా బతికి చెడిన వాడిలా వున్నాడు. నా దగ్గరగా వచ్చి "డాక్టరు వస్తాడు. కాస్సేపట్లో తేరుకుంటుంది. ఇలాంటి వ్యభిచారం పనులు చేయ కూడదు. చేసినపుడు వీటన్నిటినీ తట్టుకోవాలి మరి!" చెవిలో గుసగుసలాడాడు బైట వారికి వినిపించకుండా.

"ఏంటా మంతనాలు?" యస్సై అడిగాడు.

"అయిదు వచ్చ నోట్లంటే కొట్టమంటున్నాన్సార్!" అంటూ సర్దిచెప్పేడు.

"పోనీ ఆ పని చెయ్యి."

నా చేతిలో రెండు వందలే వున్నాయి. ఇంకా అయిదు వందలు కావా లంటున్నాడు. ఇస్తే వొదిలేస్తాడేమో ఆశ కలుగుతోంది. వ్రేలికున్న వెంకటేశ్వరుడి వుంగరం తీసి అందించాను.

కోర్టు.


బోనులో సీత.

వకీలు. సీతను ప్రమాణం చేయమన్నాడు. బాధగా చిన్నగా నవ్వుతూనే ప్రమాణం చేసింది. ఆ నవ్వులోని ఆంతర్యం అందరికీ తెలుసు.

"నువ్వు నేరం చేశావా?" అడిగాడు వకీలు.

"అసలు 'నేరం' అంటే మీ దృష్టిలో ఏమిటి?' ' ఎదురు ప్రశ్న వేసింది.

వకీలు ఖంగు తిన్నాడు. "తెలుగు సినిమా డైలాగులు రిపీట్ చేయకు. నువు వ్యభిచారం చేస్తుండగా పట్టుపడ్డావా? లేదా? ఆ పాయింట్ చెప్పు!"




"అసలు నేను వ్యభిచారం ఎందుకు చేయవ లసి వచ్చిందో మీకు తెలుసా?"

"అవన్నీ ట్రాష్. నువ్వు వ్యభిచరిస్తుండగా పట్టుబడ్డావా? లేదా? ఆన్సర్ టూ ద క్వశ్చన్!"

"నేను వ్యభిచారం చెయ్యకుండానే పట్టుకున్నారు. దీసీజ్ ట్రూ!" అంటూ అరిచింది సీత.

"ఓహో! నువు చదువుకున్న సానివన్న మాట. మరేం చేశావు ఆ సమయంలో, విష్ణు సహస్రనామం చదువు కుంటున్నావా?"

"వ్యక్తి ఔచిత్యాన్ని చెప్పేదే విష్ణు సహస్రనామం అయితే అలాంటిదే చేస్తున్నాను!"

"డొంక తిరుగుడు సమాధానం చెప్పకు. సూటిగా సమాధానం చెప్పు!"

"అవును. సూటిగా చెప్తున్నాను. జడ్జిగారూ! న్యాయ పీఠం మీద మీరున్నారు. మిమ్మల్ని సూటిగా కొన్ని ప్రశ్న లడిగి సందేహాలు నివృత్తి చేసుకో వచ్చా?"

జడ్జి కాస్సేపు ఆమె కళ్లల్లోకి చూసి, క్షణం ఆలోచించి 'తలూపుతూ "యుకెన్ ప్రొసీడ్!' అన్నాడు.

"గంటకు ముందు నాతో వ్యభిచరించిన పోలీసు, స్క్వాడ్ వస్తుందని తెలిసి అప్పటి కప్పుడు మా యింట్లో దాచుకున్న యూనిఫాం వేసుకొని నన్ను అరెస్ట్ చేశాడు! ఇది నేరం కాదా?..."

కోర్టులో నిశ్శబ్దం ఆవరించింది.


"ముగ్గురు సానులు చేసే పడుపు కూడు తినే మా ఓనరమ్మను వొదిలేసి మా శరీరంతో ఆడుకున్న ఆ పోలీసుల్నీ, రౌడీల్నీ వొదిలేసి, సగం చచ్చిన జీవచ్ఛవాన్ని కోర్టు కీడ్చుకు రావడం న్యాయమే నంటారా?

"సమాజంలో శాంతి భద్రతల సంరక్షణ కోసం రక్షకభట నిలయా లుంటాయి. ఆ పవిత్రమయిన నిలయంలో నన్ను యస్సై. ఆయన గారి ఫ్రెండ్ దారుణంగా మానభంగం చేశారు. ఇది నేరం కాదంటారా?

"అదిగో ఆ కనిపిస్తున్న పోలీసు ఆసామీ అయి దొందలు ఇస్తే వొదిలేస్తానని బేరం పెట్టేడు. ఇలా ఆడ దాని పడుపు కూడు తినడానికి సిద్ధపడే అతగాడు నిర్దోషిలా కోర్టు ప్రాంగణంలోనే తిరగడం న్యాయమే నంటారా?

"వ్యభిచారం. దాని మీద అవినీతి ముద్ర. దానికో శిక్ష. ఎక్కడ జరగడం లేదుసార్ వ్యభిచారం? స్టార్‌హోటల్లో అవసరాలు గడుపుకోడానికి స్నేహాన్ని వ్యభిచారం అనకూడదా? హై క్లాస్ రిసార్ట్స్‌లో

## సాహస బాలలు - 3



# కిడ్నాప్ దుండగుని పట్టించిన బర్కత్ ఖాన్

గత సంవత్సరం మార్చి రెండవ తేదీ సాయంత్రం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ శివారు మసూరియా అనే గ్రామంలో ఆరు సంవత్సరాల భూకా, మూడు సంవత్సరాల సబీన అనే అమ్మాయిలు వాళ్ల ఇంటి దగ్గర ఆడుకుంటున్నారు. ఆ సమయంలో బన్సీలాల్ అనే ఒక యువకుడు వాళ్ల వద్దకు వచ్చి స్వీట్లు తినిపిస్తానని మభ్యపెట్టి వాళ్లిద్దరినీ తన కూడా రమ్మని చెపితే ఆ మాయ మాటలు నమ్మి ఆ పిల్లలిద్దరూ అతగాడి వెంట వెడుతున్నారు.

అయితే ఆ ప్రాంతంలోనే ఉంటున్న బర్కత్ ఖాన్ (సంజయ్‌చోప్రా అవార్డు గ్రహీత) అనే ఎనిమిదేళ్ల బాలుడు ఎవరో ఆగంతకుడు ఇద్దరు అమ్మాయిలను తీసుకుపోతూండడం చూశాడు. గబగబ నడుచుకుంటూ వాళ్ల దగ్గరకు వెల్లి "నువ్వెవరు?" అని అనుమానంతో బన్సీలాల్‌ను అడిగితే వాడు తను ఆ పిల్లల బాబాయినని జవాబు చెప్పాడు. కానీ బర్కత్‌కు నమ్మకం కుదరలేదు. అనుమానిస్తూనే ఆ ముగ్గురినీ కొంతదూరం వెంబడించాడు. కానీ ఆ బన్సీలాల్ పిల్లలిద్దరినీ ఒక నిర్జన ప్రదేశం వైపు తీసుకెళ్లడం గమనించి, ఏదో ప్రమాదం జరగబోతోందని పసికట్టిన బర్కత్‌ఖాన్ వెంటనే వెనక్కు పరుగెత్తుకు పోయి ఆ పిల్లల తండ్రికి జరిగిన విషయం చెప్పాడు.

వెంటనే ఆ తండ్రి బర్కత్‌ను తోడుగా తీసుకుని వెంటనే పోలీస్ స్టేషన్‌కు పోయి రిపోర్టు చేయగా, బర్కత్ సహాయంతో తప్పిపోయిన పిల్లలిద్దరినీ వెదకమని ఒక పోలీసు బృందాన్ని పంపారు. వాళ్లు, మరికొందరు గ్రామస్తులు వెంట రాగా, బర్కత్ ధైర్యంగా దారి చూపగా, ఆ చుట్టుపక్కల గాలించి తప్పిపోయిన ఆ ఇద్దరు అమ్మాయిలతో ఊరికి దూరంగా ఒక పాడుబడ్డ ఇంటిలో దూరి ఉన్న ఆ దుండగుడిని పసిగట్టారు. వాడిని అరెస్టు చేసి పిల్ల లిద్దరినీ వైద్య పరీక్ష చేయించగా ఆరేళ్ల పాప భూకాపై అప్పటికే అత్యాచారం జరిగినట్లు తేలింది. అయితే బర్కత్ చూపిన చొరవ వలన నాలుగేళ్ల మరో బాలిక సబీన మాత్రం వాడి బారి నుండి బయటపడింది.

అరెస్టయిన బన్సీలాల్‌ను పోలీసులు ప్రశ్నించగా, తాను అప్పటికి జోద్‌పూర్ పరిసరాల్లో తొమ్మిదిమంది మైనర్ బాలికలను కిడ్నాప్ చేసి వారిపై అత్యాచారం జరిపినట్లు అంగీకరించాడు. వాడిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు.

బర్కత్‌ఖాన్ చూపిన సమయస్ఫూర్తి, ధైర్యం వలన ఒక నేరస్తుడిని పట్టి బంధించడంలో సహాయపడ్డాయి.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

పచ్చిగా వ్యభిచరిస్తుంటే వాళ్లంతా పెద్ద మనుషులంటున్నాం. వాళ్లకు అవసరమయిన రక్షణ కల్పిస్తున్నాం. హెల్త్ క్లబ్‌ల పేరుతో సాగుతున్న సౌందర్యారాధనలో వ్యభిచారం కూడా ఒక భాగంగా లేదా? సంఘంలో స్టేటస్‌కీ, గొప్ప గొప్పోళ్ల పరిచయానికి వినిమయ సాధనంగా మారిందీ వ్యభిచారం. కాదంటారా? ఇది మీకు తెలీదంటారా? దిన పత్రిక తిరగేస్తే పేపర్ల నిండా మైనరు బాలికల రక్తపు మరకలే. వాళ్ళకు నిజంగా శిక్ష పడుతుందా? సరైన శిక్షాస్మృతే అమలులో వుంటే నన్ను పోలీస్ స్టేషనులో పోలీసుల సాక్షిగా, తుప్పు పట్టిన తుపాకుల సాక్షిగా, తోలు బెల్టు సాక్షిగా ఆ యస్సై రేప్ చేశాడు. అత్యాచారం చేశాడు. దీనికి మీరే 'శిక్ష వేస్తారు?"

ఒక్క క్షణం స్తబ్దంగా వుండి పోయింది న్యాయ పీఠం.

"జడ్జి గారూ! ఇందుకు సాక్షులు ఎవరైనా వున్నారా అని అడక్కండి. ఒక్కరూ ముందుకు రారు! నా మనస్సాక్షి సాక్షిగా చెప్తున్నాను. నమ్మండి' ' అంది సీత.

"అవున్సార్! ఇందుకు సాక్ష్యంగా నేను. నేను వ్యభిచరించడం కోసం వెళ్లలేదు. వాళ్ల దయనీయమయిన జీవితాన్ని కథగా రాద్దామని వెళ్లాను. సీత చెప్పిన మాటలన్నీ అక్షర సత్యాలు. సీత మీద పోలీస్ స్టేషన్‌లో నా కళ్ల ముందే అతి దారుణంగా అత్యాచారం జరిపేరు. ఇందుకు సాక్ష్యం నేను! శిక్ష వేయండి. నేరస్తు లందరికీ కఠిన మయిన శిక్ష వేయండి!" గొంతు బొంగురు వోయేలా అరిచాను.

'నేరస్తురాలుగా పరిగణించబడిన ముద్దాయి సీత. వాదం పూర్తిగా విన్న తర్వాత, వ్యభిచారం కేసులో పట్టుబడిన విద్యార్థి యువకుడు రాము 'సాక్ష్యం'లో నిజానిజాలు గ్రహించిన తరువాత, ఈ వ్యభిచార వృత్తికి దోహదం చేసిన సంఘటనల్నీ, వ్యక్తుల్నీ క్షుణ్ణంగా విశ్లేషించిన తర్వాత. ఈ న్యాయ పీఠం మీద న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్న నేను ఇలా తీర్పుని కోర్టు ముఖంగా ఆదేశిస్తున్నాను.

"వ్యభిచార వృత్తిలో దించే పోకిరీ రాయుళ్లకు యావజ్జీవిత కారాగార శిక్ష. వ్యభిచార గృహాల్ని నిర్వహించే యజమానులకు బ్రతికినంత కాలం కఠిన కారాగారవాసం. శాంతిభద్రతల్ని సుస్థిరం చేసేందుకు కంకణం కట్టుకొన్న పోలీసులే అత్యాచారం జరిపినందుకు.. అందుకు తగ్గ సాక్ష్యాధారాలు రుజువయి నందుకు, వారికి ఉద్యోగంలో నుంచి సస్పెన్షన్. ఇటువంటి అత్యాచారానికి ఎవరు పాల్పడినా వారికి యిదే శిక్ష విధించ బడుతుందని, ఇందులో గొప్ప, పేద తారతమ్యాలకు తావే లేదని. ఇందుకు వ్యతిరేకంగా.. ఈ తీర్పుని ప్రతిఘటించాలని ఎవరు... ఎవరు పూనుకున్నా వారికి శిక్ష కఠినంగా అమలు చేస్తామని ధ్రువీకరిస్తూ ఈ తీర్పుని ఆదేశించడమైనది!"

ఇదీ తీర్పు!!

న్యాయ నిర్ణేత చదివిన తీర్పు.

కోర్టులో దద్దరిల్లిన ప్రజల వెల్లువ హోరులో లీలగా వినిపించిన తీర్పు.

న్యాయ దేవత కళ్లకు కట్టిన గంతలు తొలగించి, కళ్లారా చూసి ఆనంద బాష్పాలు చిలకరించిన తీర్పు.

న్యాయ పీఠం గర్వంగా ఒళ్లు విదిలించుకున్న తీర్పు.

సీత చెంపలను తాకుతూ చిప్పిల్లిన రక్తాశ్రువులు. స్వాతి చినుకుల్లా పరవశించిన తీర్పు. నా కలలో తీర్పు...

నా కథలో తీర్పు... నా తీర్పు....

మరి జడ్జిగారు ఏం 'తీర్పు' చదువుతారో వేచి చూడాలి!

Ⓟ